## క్లుప్తంగా

### గ్రామ సచివాలయం తనిఖీ



కోడుమూరు సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న పీడీ వెంకటసుబ్బయ్య

**కోడుమూరు రూరల్:** కోడుమూరు గ్రామ సచివాలయం-4, అంగన్‌వాడీ సెంటర్-24ను బుధవారం నియోజవకర్గ స్పెషల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులను పరిశీలించడంతో పాటు, ప్రతి రోజు ఎన్ని సర్వీసులు చేస్తున్నారు, మిషన్ వాత్సల్య పథకం కింద ఎంతమంది నమోదయ్యారు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. అలాగే అంగన్‌వాడీ సెంటర్ ద్వారా బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం క్రమం తప్పకుండా ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మరింత రుచికరంగా ఆహారం తయారుచేయాలని సిబ్బందికి సూచించారు. పీడీ వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్ ఉన్నారు.

### రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

**గడివేముల:** మండల అన్ని గ్రామాల్లో కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారందరూ ఈ నెల 31వ తేదీలోగా వైఎస్సార్ రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ హేమసుందర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, 1బీ, ఫోన్ నంబర్‌తో ఆయా గ్రామాల్లోని ఆర్బీకేలలో సంప్రదించాలని సూచించారు. మే 15వ తేదీన ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.7500 జమ చేయనున్నట్లు చెప్పారు. ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### తాగునీటి ఎద్దడి రానీయొద్దు

**గూడూరు రూరల్:** గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ మాధవీలత సచివాలయ ఉద్యోగులకు సూచించారు.కె.నాగలాపురంలోబుధవారం తాగునీటి సరఫరాను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. నీటిసమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పైపులైన్ లీకేజీలు, విద్యుత్ మోటార్ల మరమ్మతులు ఉంటే వెంటనే బాగు చేయించుకోవాలన్నారు.అదనపు విద్యుత్ మోటార్లను సిద్ధంగా ఉంచుకోవాలని, తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయాలని సూచించారు.

### విద్యార్థులకు అవగాహన

**సి.బెళగల్:** స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల కు ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా ప్రజా సంస్థల సేవలు, పనితీరుపై అవగా హన కల్పించారు. పాఠశాలలో తొమ్మిదో తర గతి చదువుతున్న విద్యార్థులను బుధవారం స్కూల్ హెచ్ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం, మండల పరిషత్ కార్యాలయం ,డిగ్రీకళాశాల సందర్శనకు తీసుకెళ్లారు. ప్రభుత్వపథకాల అమలు,ఉద్యోగుల పనితీరు, ప్రజా సేవల విధానాలను పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్ నాయుడు వివరించారు. వ్యవసాయ సహాయకులు బిందు, సర్వే సహాయకులు తిరుమలనాయుడు, ఇతర ఉద్యోగులు తమ పనితీరు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా వినాయక డిగ్రీ కళాశాలలో విద్యాబోధన, కంప్యూటర్ తరగతులు తదితర వాటిని లెక్చరర్లు వివరించారు. ఒకేషనల్ ట్రైనర్ దామోదర్ తదితరులు ఉన్నారు.

### స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**కల్లూరు:** కల్లూరు ఎస్టేట్‌లోని వెంకటచలపతి నగర్‌లో నివాసం ఉంటున్న అన్వర్ బాషా కుటుంబానికి బాల్య స్నేహితులు బుధవారం రూ.36,600 ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారు. అన్వర్ బాషా ఓ ప్రైవేటు సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ నాలుగు నెలల క్రితం గుండెపోటుకు గురై మరణించాడు. విషయం తెలుసుకున్న 1985-1986 వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి మిత్రబృందం వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు.

### అనుమానితులు కనిపిస్తే సమాచారమివ్వండి

**గడివేముల:** మండలంలోని గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తుంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య కోరారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. వేసవి కావడంతో రాత్రి మిద్దెలపై పడుకునే వారు ఇంటికి జాగ్రత్తగా తాళాలను వేసుకోవాలన్నారు. వేరే ఊర్లకు వెళ్లే వారు ఇరుగుపొరుగు వారికి చెప్పడంతో పాటు విద్యుత్ మెయిన్ స్విచాఫ్ చేసి వెళ్లాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 91211 01097 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

### అటెండర్ మృతికి నివాళి

**గడివేముల:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న అటెంబర్ ఖలీల్ (55) మృతి చెందడం బాధాకరమని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. ఖలీల్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున మరణించాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్ మాధవ, ఆర్‌ఐ శ్రీనివాసులు నంద్యాలలోని ఇంటివద్దకు చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు.

# వేలాడుతున్న యమపాశాలు

- ఇంటిపై మూడడుగుల ఎత్తులో వేలాడుతున్న 11 కేవీ వైర్లు
- కొన్నేళ్ల నుంచి సమస్య ఉన్నా పట్టించుకోని అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



చిందుకూరు ఎస్సీ కాలనీలో ఇంటిపై వేలాడుతున్న విద్యుత్ తీగలను కర్ర సపోర్టుతో పైకి ఎత్తి ఉంచిన దృశ్యం

**గడివేముల:** ఇంటి పైకి ఎక్కిన వారు పొరపాటున చెయ్యి పైకి ఎత్తితే ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందే. విద్యుత్ తీగలు కావివి మా పాలిట యమపాశాలంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడివేముల మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఆయా కాలనీవాసులు క్షణక్షణం బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపుల సమయంలో మరింత భయాందోళనకు గురవుతున్నారు.

మండల పరిధిలోని చిందుకూరు, బూజునూరు, సోమాపురం, మంచాలకట్ట గ్రామాల్లోని కాలనీల్లో ఇళ్లపైనే 11 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయి. తీగలు ఇళ్లపై కేవలం మూడడుగుల ఎత్తులోనే ఉండటంతో పలువురు ప్రమాదాలు జరగకుండా కర్రలను సపోర్టుగా ఉంచి విద్యుతు తీగలను పైకి ఎత్తి పెట్టుకున్నారు. ఇళ్లపైకి ఎక్కాలంటే భయంతో వణికి పోతున్నారు. బూజునూరు గ్రామంలో కాలనీలో 11 కేవీ వైర్లు తగిలి వ్యక్తులు చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. గత కొన్నేళ్ల నుంచి సమస్యపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.

**ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవనం**

చిందుకూరు గ్రామంలోని నంద్యాల మెయిన్ రోడ్డు దగ్గరలోని కాలనీలో ఇళ్లపైకి వెళ్లాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకోవాల్సిన పరిస్థితి. 11 కేవీ లైన్ విద్యుత్ తీగలు ఇళ్లపైనే వేలాడుతున్నాయి. ఇంటి యజమానులు కర్రలను సపోర్టుగా ఉంచి తీగలను పైకి ఎత్తి పెట్టుకున్నారు. వాటి పక్కనే కేబుల్ వైర్లు, బట్టలు ఆరవేసుకోవడానికి కట్టిన తాళ్లు ఉన్నాయి. చిన్న పిల్లలు ఇంటిపైకి వెళ్లకుండా కాపలా ఉండాల్సిన పరిస్థితి. విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే తీగలను మరోచోటికి మార్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

### విద్యుత్ లైన్లు మరోచోటికి మార్చాలి



విద్యుత్ తీగలు ఇళ్లపై నుంచి వెళ్తున్నాయి. వర్షకాలంలో గాలులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంటుంది. బట్టలను ఆరవేయాలన్నా, పప్పు దినుసులను ఎండబెట్టుకోవాలన్నా ఇంటి పైకి వెళ్లాల్సి వస్తుంది. ప్రజాప్రతినిధులు, విద్యుత్ అధికారులు స్పందించి లైనును మరోచోటికి మార్చాలి. –రాజు, చిందుకూరు, గ్రామం

### ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు



గత కొన్నేళ్ల నుంచి 11 కేవీ విద్యుత్ వైర్లు ఇళ్లపై చేతులకు అందెంత ఎత్తులో ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మా కాలనీలో వైర్లు కిందకు వేలాడుతుండడంతో అధికంగా గాలులు వీచినప్పుడు భయం భయంగా ఉంటుంది. గతంలో మా అమ్మ విద్యుత్ షాక్‌కు గురైంది. ఇళ్లపై ప్రమాదకరంగా మారిన వైర్లను తొలగించి, ఊరి బయట ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నాం. –మహబూబ్ బాషా, బూజునూరు గ్రామం

### షిఫ్టింగ్ చార్జెస్ చెల్లిస్తే మారుస్తాం

చిందుకూరు, బూజునూరు గ్రామాల్లోని కాలనీల్లో 11 కేవీ విద్యుత్ వైర్లు నివాస గృహాలపైనే ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆయా గ్రామస్తుల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి విద్యుత్ తీగల సమస్యపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

–రమణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, విద్యుత్ శాఖ, నంద్యాల

### రైతులకు విత్తనాల పంపిణీ

**పాణ్యం:** ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు స్థానిక పాదుపు కార్యాలయంలో విత్తనాల కిట్లు అందించినట్లు ఏపీఎం ప్రసాద్ బుధవారం తెలిపారు.ఆయన మాట్లాడుతూ.. రబీలోనూ పొలం ఖాళీగా ఉంచకుండా 30 రకాల (నవధాన్యాలతో కలిపి) విత్తనాలతో కూడిన కిట్లను 400 మందికి అందించినట్లు చెప్పారు.వీటి సాగుతో నేల సారవంతం కావడంతో పాటు పశువులకు గ్రాసం లభిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పుల్లయ్య, శివకుమార్, కరిముల్లా షా ఖాద్రి, సిసింద్రి, మహేష్‌బాబు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు గురుకులం విద్యార్థులు

**సి.బెళగల్:** స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరప్ప, అధ్యాపకులు, ఉపాధ్యాయులతో కలిసి పీడీ రాఘవేంద్ర, పీఈటీ రవి, పోటీలకు ఎంపికైన విద్యార్థులు నాయక్, వినయ్‌లను అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలు, మెడల్లను అందజేశారు. పీఈటీ రవి కుమార్ మాట్లాడుతూ.. ఈ నెల 18న కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి అండర్- 18 రగ్బీ పోటీల్లో క్రీడాకారులు నాయక్, వినయ్ సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 30, మే 1వ తేదీన కర్నూలులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొంటారని పీఈటీ తెలిపారు.

## గ్రామాల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి



మాట్లాడుతున్న కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ



హాజరైన మండలాధికారులు, సభ్యులు

**కర్నూలు (న్యూటౌన్):** గ్రామాల అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కర్నూలు ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ అన్నారు. బుధవారం జెడ్పీలో కర్నూలు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు, గృహ నిర్మాణాలు, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, ఉపాధి హామీ పథకం, పొదుపు లక్ష్మీ గ్రూపులు, స్త్రీ, శిశు సంక్షేమం, పశుపోషణ, వ్యవసాయం, విద్య, వైద్యం, కుటుంబ నియంత్రణ, గ్రామ పంచాయతీ - అభివృద్ధి పనులు, మైనర్ ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ రోడ్లు, భవనాలు, గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు చేపట్టాలని, గ్రామాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ తన సొంత నిధులతో గార్గేయపురం, పంచలింగాలలో మంచినీటి బోర్లను వేయించి ప్రజల దాహార్తి తీర్చారన్నారు. సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని, మనబడి నాడు-నేడు పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచి వారికి పనిప్రదేశంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో కర్నూలు మండల స్పెషల్ ఆఫీసర్ విజయ, డీటీ సాహెరాబాను, ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, వైస్ ఎంపీపీ-2 నెహేమ్యా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఈర్లదిన్నెలో 'గడప గడపకు మన ప్రభుత్వం'ను ప్రారంభించిన ఎమ్మెల్యే
- గ్రామస్తుల నుంచి విశేష స్పందన



ఈర్లదిన్నె గ్రామంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

**సి.బెళగల్:** రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ స్పష్టం చేశారు. ఆయన బుధవారం మండలంలోని ఈర్లదిన్నె గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ మూడున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, ఆయా ఇళ్లకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను అధికారులతో నమోదు చేయించి వాటిని వీలైంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా అమలుకాని సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నేరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం కృషితోనే తాము గ్రామాలలో జనం ముందుకు రాగలుగుతున్నామని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని, ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలు అందుతుంటే ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ నాయకులు లేనిపోని మాటలు మాట్లాడుతూ, అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఎంపీపీ బొంతల మునెప్ప, ఎంపీటీసీ సభ్యులు నడిపి సోమన్న, మణిమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు క్రిష్టారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, పెద్ద సోమన్న, మహానంది, ఆనందం, సూర్యచంద్ర, రాఘవేంద్ర, రామచంద్రారెడ్డి, వివిధ శాఖల మండలాధికారులు పాల్గొన్నారు.

**బండలాగుడు పోటీలు ప్రారంభం**

**గూడూరు:** పట్టణంలో జరుగుతున్న తిమ్మగురుడు జాతరను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం హైస్కూల్ మైదానంలో వృషభాల బండలాగుడు పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో 9 జతల ఎద్దులు పాల్గొన్నాయి. విజేతల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందిస్తామని నిర్వాహకులు ప్రకటించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ ఏఈ నరసింహులు, జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, బోయ లక్ష్మన్న, కౌన్సిలర్లు నంద కిషోర్, మద్ది, విజయ్, నాయకులు పత్తి రంగడు, సత్యాలు, ప్రతాప్, గుంటి రంగడు, జూలకల్లు కాంతారెడ్డి, మునుగాల రామాంజనేయులు ఉన్నారు.

**ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే**

**కోడుమూరు రూరల్:** రంజాన్ మాసం పురస్కరించుకొని కోడుమూరులోని పెద్దమసీదులో బుధవారం రాత్రి వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షాకీర్‌బాషా ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు. ముస్లింలకు స్వయంగా వంటకాలను వడ్డించడంతో పాటు, వారితో కలిసి విందు స్వీకరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్ రెడ్డి, లాయర్ ప్రభాకర్, ఏకాంబరం, చాంద్, ఖలీల్, షబ్బీర్, ఖాజా తదితరులు ఉన్నారు.

## మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దాం



అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేక అధికారి అమర్‌నాథ్ రెడ్డి

**ఓర్వకల్లు:** మండల స్థాయి అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ మెరుగైన అభివృద్ధికి కృషి చేద్దామని మండల ప్రత్యేక అధికారి (డ్వామా పీడీ) అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాయంత్రం మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ సృజన ఆదేశాల మేరకు తాను ఓర్వకల్లు మండల ప్రత్యేక అధికారి హోదాలో రావడం జరిగిందన్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి ప్రజల్లోకి ముందుకు వెళదామని పిలుపునిచ్చారు. ఒక్కో అధికారికి కొన్ని గ్రామాలను కేటాయించి, ఆ గ్రామంలో ఏయే పనులు చేపట్టాలన్న అంశాలను గుర్తించాలన్నారు. అధికారులు గుర్తించిన సమస్యలు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రతి బుధవారం నిర్వహించే సమీక్షలో నివేదించాలని సూచించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూనే, సమస్యల పరిష్కార దిశగా ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు.ఎంపీడీఓ శివనాగ ప్రసాద్, ఏఈలు రామసుబ్బారెడ్డి, రామయ్య, ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఈసీ మధువెంకటకృష్ణ, వ్యవసాయాధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**అడిగిన వారందరికీ పనులు కల్పిస్తాం**

**కల్లూరు:** జాతీయ ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పిస్తామని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన బస్తిపాడు, బొల్లవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతోందని కూలీలు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు పనులు చేయాలన్నారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేస్తే పూర్తి వేతనం వస్తుందన్నారు. ఉపాధి హామీ పథకం ఈసీ మధుసూదన్‌రావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణం అద్భుతం



ఆలయ నిర్మాణ విశేషాలను తెలుసుకుంటున్న భారతి సిమెంట్ వైస్ ప్రెసిడెంట్ ఎం.సి.మల్లారెడ్డి

**కోడుమూరు రూరల్:** కోడుమూరులో నిర్మిస్తున్న పంచాయతన దేవతల సహిత శ్రీలక్ష్మి వేంకటేశ్వర ఆలయ పునర్నిర్మాణం అద్భుతం అని భారతి సిమెంట్ వైస్ ప్రెసిడెంట్ ఎం.సి.మల్లారెడ్డి అన్నా రు. ఆలయ చైర్మన్, దాత ఎద్దుల మహేశ్వరరెడ్డి కోడుమూరులో దాతల సహకారంతో రూ.9 కోట్ల వ్యయంతో పురాతన పద్ధతిలో పూర్తిగా రాతిశిలల తో నిర్మిస్తున్న శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయా న్ని బుధవారం మల్లారెడ్డి, భారతి సిమెంట్ టెక్నికల్ హెడ్ ఓబుల్‌రెడ్డి, జిల్లా సేల్స్ మేనేజర్ ఇక్బాల్‌బాషా సందర్శించారు. ఆలయ నిర్మాణ విశేషాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎం.సి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. పురాతన పద్ధతితో పూర్తిగా రాతిదూలాలు, శిలలతో ఆలయాన్ని నిర్మిస్తుండడం అద్భుతం అని, ఆలయ నిర్మాణం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఇంతటి మహాకార్యానికి శ్రీకారం చుట్టిన దాత ఎద్దుల మహేశ్వరరెడ్డిని అభినందించారు. ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

## విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయండి



కె.సింగవరం యూపీ స్కూల్లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ జ్యోతి

**సి.బెళగల్:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి సూచించారు. ఆమె బుధవారం మండల పరిధిలోని పోలకల్, ముడుమాల, ఈర్లదిన్నె ప్రాథమిక పాఠశాలలను, కె.సింగవరం యూపీ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల రికార్డులను, పరిసరాలను, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. ఉపాధ్యాయులు రాసిన పాఠ్యాంశ ప్రణాళికలు, వర్క్‌బుక్‌లు, డైరీల నిర్వహణను పరిశీలించి టీచర్లకు సూచనలు చేశారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలల విద్యార్థులచే పాఠ్యాంశాలను చదివించి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. కొందరు విద్యార్థులు పాఠ్యాంశాలలో వెనుకబడి ఉండటం, పదాలను, అక్షరాలను గుర్తుపట్టక పోవడంపై ఎంఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి వారికి అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలన్నారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన



రాజీవ్ కాలనీలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

**కల్లూరు:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 26వ వార్డు 69వ వార్డు సచివాలయం పరిధిలోని రాజీవ్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ డీఎల్ కాంతారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కాలనీలో సమస్యలు ఉంటే తనకు తెలియజేయలన్నారు. జగనన్న పాలనలో ప్రజా ప్రతినిధులు ప్రజల వద్దకే వచ్చి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న జగనన్న వెంట నిలిచి రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, తిరుపాల్, బాలచంద్రారెడ్డి, భీమశంకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న పాలనకు సంపూర్ణ మద్దతు



ప్యాలకుర్తిలో లబ్ధిదారుడి అభిప్రాయం నమోదు చేసుకుంటున్న ఎమ్మెల్యే సుధాకర్

**కోడుమూరు రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారుడి గడప వద్దకు నేరుగా చేరుతున్నాయని, లబ్ధిదారులు జగనన్న పాలనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. ఆయన బుధవారం సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ప్యాలకుర్తి గ్రామంలో ×జగనన్నే మా భవిష్యత్తు¥ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి గత చంద్రబాబు పాలనతో పోల్చుకుంటే వైఎస్సార్‌సీపీ హయాంలో మీ కుటుంబానికి మంచి జరిగిందా? సంక్షేమ పథకాలను కొనసాగించాలా? అంటూ ఆరా తీసి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఇంటి గోడకు జగనన్న స్టిక్కర్లను అతికించారు.

**నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ కోడుమూరు ప్రజల నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ.30.30 కోట్లను కేటాయిస్తూ టెండర్లను ఆహ్వానించడం హర్షించదగ్గ విషయమన్నారు. జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు గోరంట్ల-కొత్తపల్లె బ్రిడ్జి నిర్మాణం, కోడుమూరు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేయడం పట్ల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే సుధాకర్ నియోజకవర్గంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 150 రోజులు పూర్తయిన సందర్భంగా స్థానిక నేతలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, ముల్లా సలీం, మధుమోహన్‌రెడ్డి, సులేమాన్, మిన్నెల్ల, శ్రీనివాసులు, అన్సర్, సీతారాముడు, ఆదన్న, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

**ఓర్వకల్లు:** 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని హుసేనాపురం, కాల్వబుగ్గ, ఉయ్యాలవాడ గ్రామాలలో ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గడప గడపను సందర్శించి స్వయంగా ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. హుసేనాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, సర్పంచు గోవర్ధనమ్మ, చంద్రపెద్దస్వామి, లోటర్ బాష ఇంటింటికీ వెళ్లి జగనన్న స్టిక్కర్లను అతికించారు. సంక్షేమ పథకాలు అందాయా? లేదా అనే అంశాలపై ఆరాతీశారు. టీడీపీ వారు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని, రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

**కోడుమూరు:** ఫర్టిలైజర్ దుకాణాల డీలర్లు విత్తనాలు, ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని, అధిక ధరకు అమ్మితే చర్యలు తప్పవని ఏఓ రవిప్రకాష్ హెచ్చరించారు. ఆయన బుధవారం పట్టణంలోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి స్టాక్ రిజిష్టర్లు, పత్తి విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. పత్తి విత్తనాల ప్యాకెట్లను రైతులకు అవసరమైన మేరకే విక్రయించాలని, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. రైతు ఆధార్, ఫోన్ నంబర్ రసీదులో రాయాలని, విత్తనాల విక్రయానికి తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అనుమతులు పొంది ఉండాలన్నారు. రైతులు కొనే ప్రతి వస్తువుకు రసీదు ఇవ్వాలని, రేట్ల పట్టికను దుకాణాల ముందు ప్రదర్శించాలన్నారు.

### రైతులకు అందుబాటులో ఉండాలి

**సి.బెళగల్:** గ్రామాల్లోని ఆర్బీకేలో వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. ఆయన బుధవారం మండలంలోని కొత్తకోట, ఈర్లదిన్నె గ్రామాలలో పర్యటించి ఆయా గ్రామాల ఆర్బీకేలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తకోటలో పంట నమోదు అంశాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులైన రైతుల వివరాలను ఆర్బీకే ఇన్‌చార్జ్ సంధ్యను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు.

## సుస్థిరాభివృద్ధి సర్వే వేగవంతం చేయండి

**కర్నూలు (న్యూటౌన్):** సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు చేపట్టిన సర్వేను వేగవంతం చేయాలని కర్నూలు మండల స్పెషల్ ఆఫీసర్ విజయ అన్నారు. బుధవారం మధ్యాహ్నం ఆమె మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వేగం పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు తమ వంతు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో కర్నూలు ఎంపీడీఓ ఎస్.భాస్కర్ నాయుడు, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంగస్వామి, హౌసింగ్ ఏఈ కృష్ణమూర్తి, ఏపీఓ మహమ్మద్ బాషా, ఏపీఎం మల్లికార్జున స్వామి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.